క్లుప్తంగా

చండీహోమం



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలోని పోచమ్మ ఆలయంలో మాజీ ఎంపీటీసీ మట్ట సుజాత–రాజు ఆధ్వర్యంలో శనివారం చండీ యాగం చేపట్టారు. తొలుత నవగ్రహాల పూజ నిర్వహించారు. అనంతరం 108 కలశాలతో ప్రత్యేకంగా కలశ పూజ చేశారు. అనంతరం అర్చకులు ఎదుగురి రమేష్‌మూర్తి, సాగరశాస్త్రి, నాగేందర్‌స్వామి ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో ప్రముఖ శిల్పి మట్ట రాజు సొంత డబ్బుతో నాలుగేళ్ల క్రితం ఆలయాన్ని నిర్మించినప్పటి నుంచి ఏటా వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా చండీహోమం నిర్వహిస్తున్నారు. హోమంలో గ్రామ పెద్దలు, వివిధ కుల సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

చెన్నారావుపేట : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు బాధితుడికి శనివారం అప్పగించారు. వివరాలిలా.. మండలంలోని గురిజాలకు చెందిన కందుల రవీందర్ ఏప్రిల్ 30న ఫోన్ పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సీఈఐఆర్ పోర్టల్ ఆధారంగా అతడి సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌కు సీఐ చంద్రమోహన్ ఫోన్ అందజేశారు. ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో కానిస్టేబుల్ జగదీష్ క్రియాశీలకంగా వ్యవహరించాడని సీఐ అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం

చెన్నారావుపేట : మండలంలోని కాల్‌నాయక్ తండాలో రూ.2.50 లక్షల వ్యయంతో చేపట్టిన సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాదావత్ వీరన్న నాయక్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ బానోతు పత్తినాయక్ మంజూరు చేసిన నిధులతో పనులు చేపట్టినట్టు తెలిపారు. తండావాసులకు అవసరమైన సదుపాయాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గుగులోతు రవి, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు, తిర్మలాయపల్లి, మైలారం, ఊకల్, గన్నారం గ్రామాల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది శనివారం ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ కూచన ప్రకాష్ ఫాగింగ్‌ను పర్యవేక్షించి మాట్లాడారు. గ్రామాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయించినట్టు తెలిపారు.

నివాళి

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్‌కు చెందిన ఒగ్గుల చిలకమ్మ, చింతనెక్కొండకు చెందిన కుడికాల సరోజన శనివారం మృతి చెందగా వారి మృతదేహానికి ఎమ్మెల్యే నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మాసాని సువార్త, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రరావుకు..

నర్సంపేట : సీపీఐ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా, రాష్ట్ర కోశాధికారిగా, ఉద్యమ నాయకుడిగా పని చేసిన డీఎస్.రామచంద్రరావు శనివారం మృతి చెందగా ఆయన చిత్రపటానికి పట్టణంలోని సీపీఐ కాలనీలో పార్టీ నాయకులు శనివారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ మాట్లాడారు. రామచంద్రరావు పేదల కోసం నిర్మించిన పోరాటాలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్, దామెర కృష్ణ, గన్నవరం రమేష్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతదేహానికి..

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లక్క శంకరయ్య (68) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు మంద యాకయ్య, సాదు మధుసూదన్‌రెడ్డి, వీరారెడ్డి, నన్నెబోయిన రమేష్ యాదవ్, మంచాల సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని మొరిపిరాలకు చెందిన బుర్రి రాజిరెడ్డి, సన్నూరుకు చెందిన కుందూరు సంతోష్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నాయకులు శనివారం పరామర్శించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మద్యం విక్రయాలు

- పల్లెల్లో ఇష్టారీతిన బెల్ట్ షాపులు
- నియంత్రణలో అధికారుల విఫలం



పర్వతగిరిలో మద్యం షాపు ఎదుట నిలిపిన వాహనాలు

పర్వతగిరి : మండలంలో యథేచ్ఛగా మద్యం విక్రయాలు సాగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని పల్లెల్లో భారీ సంఖ్యలో బెల్ట్ షాపులు నడుస్తుండడంతో యువత మద్యానికి బానిసలవుతున్న పరిస్థితి నెలకొంది. మద్యం మత్తులోనే వాహనాన్ని నడుపుతూ పలువురి మృతికి కారణమవుతున్నా నిబంధనలు పాటించని మద్యం దుకాణాల యజమానులపైనా, మద్యం మత్తులోనే వాహనాలు నడుపుతున్న వారిని నియంత్రించడంలో సంబంధిత శాఖల అధికారులు విఫలమయ్యారన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి.

పర్వతగిరి, అన్నారం షరీఫ్, చింతనెక్కొండ, ఏనుగల్ గ్రామాల్లో ప్రభుత్వం ఆరు మద్యం దుకాణాలకు అనుమతి ఇచ్చింది. వాటికి నిబంధనల మేరకు సిట్టింగ్‌కు అనుమతి ఉంది. మద్యం షాపుల యజమానులు నిబంధనలు పాటించడం లేదని తెలుస్తోంది. మద్యం షాపులకు ద్విచక్ర వాహనాలు, కార్లలో వచ్చి మందు తాగి వాహనాలను నడుపుతూ ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నారని జనం బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మద్యం దుకాణాల ఎదుట ఇష్టారీతిన వాహనాలు నిలుపుతున్నా, మందు తాగి వాహనాలు నడుపుతున్నా సదరు వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల్లో అసహనం వ్యక్తం అవుతోంది. మద్యం దుకాణాల యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా ఎక్సైజ్, పోలీసు అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అన్నారం దర్గాకు వచ్చి కందూరు చేసుకుని మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పలువురు మృతి చెందిన విషయం తెలిసిందే. పర్వతగిరిలో మద్యం షాపుల ఎదుట వాహనాలు నిలిపి మందు తాగి అనంతరం వాహనాన్ని నడుపుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

భారీ సంఖ్యలో బెల్ట్ షాపులు

మండలంలోని అన్ని గ్రామాల్లోనూ 10 నుంచి 30 వరకు బెల్ట్ షాపులున్నట్టు తెలుస్తోంది. బెల్ట్ షాపులపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మండల ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తాగుబోతులకు అడ్డాగా బిర్యానీ సెంటర్లు

మండలంలోని పర్వతగిరి, అన్నారం షరీఫ్, చింతనెక్కొండ, ఏనుగల్, కొంకపాక, వడ్లకొండ, తురుకల సోమారం గ్రామాల్లో హోటళ్లు, బిర్యానీ సెంటర్లు తాగుబోతులకు అడ్డాగా మారాయి. వాటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

అధికారులు చర్యలు చేపట్టాలి



పలువురు వాహనాలపై వచ్చి మద్యం సేవించి వాహనాలు నడుపుతుండడంతో ఇతరులు ప్రమాదాలకు గురవుతున్న క్రమంలో అధికారులు చర్యలు చేపట్టాలి. మద్యం మత్తులో నడపడం వల్లే ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నారు.

-జేరిపోతుల కుమారస్వామి, రోళ్లకల్

బెల్ట్ షాపులను అరికట్టాలి



మండలంలో బెల్ట్ షాపులను అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. బెల్ట్ షాపుల్లో సుమారు రూ.30–40 వరకు అధికంగా దండుకుంటున్నారు. బెల్ట్ షాపులను అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి.

-ఎం.దేవేందర్, పర్వతగిరి

దాడులు చేస్తాం

వర్ధన్నపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వర్ధన్నపేట, రాయపర్తి, సంగెం, పర్వతగిరి మండలాల్లో ఇప్పటికే దాడులు కొనసాగిస్తున్నాం. పర్వతగిరి మండలంపై ప్రత్యేక దృష్టి పెట్టి బెల్ట్ షాపుల అరికట్టేందుకు చర్యలు చేపడతాము. వాహనదారులు మద్యం సేవించేందుకు వెళ్లేప్పుడు మద్యం తాగని వారిని వెంట తీసుకెళ్లి వారితో వాహనం డ్రైవింగ్ చేయిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండవు.

-స్వరూప, ఎక్సైజ్ సీఐ

గ్రామీణుల చెంతకు బ్యాంకు సేవలు

- కాకతీయ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ రాజు

నెక్కొండ : కాకతీయ గ్రామీణ బ్యాంకు సేవలను పల్లె ప్రజల చెంతకు చేర్చడమే లక్ష్యంగా బ్యాంకు మిత్ర కేంద్రాలు పని చేస్తున్నట్టు మేనేజర్ రాజు తెలిపారు. మండలంలోని అప్పల్‌రావుపేటలోని బ్యాంకు మిత్ర సెంటర్‌లో బ్యాంకు పాస్ బుక్ ప్రింటింగ్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టణాల్లోని బ్యాంకులకు రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు వచ్చి సేవలు పొందడం కొంత ఇబ్బందికరమైన పరిస్థితి నేపథ్యంలో పల్లెల్లోనే మరిన్ని సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. మైక్రో ఏటీఎం ద్వారా పాస్ బుక్ సేవలు అందేలా ఐఆర్ఐఎక్స్ సంస్థ టెక్నాలజీని అభివృద్ధి చేసిందన్నారు. ఖాతాదారులందరూ ఉచితంగా పాస్ బుక్ సేవలు పొందవచ్చని చెప్పారు. పాస్ బుక్ ముద్రణ ప్రాముఖ్యత వివరించారు. అన్ని బ్యాంకు మిత్ర పాయింట్లలోనూ ప్రింటర్ సదుపాయం కల్పించాలని చెప్పారు. ఖాతాదారులు బ్యాంకు మిత్ర సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఆర్ఐఎక్స్ వరంగల్ ఇన్‌చార్జ్ పసునూరి శోభన్, చానల్ మేనేజర్ కక్కెర్ల అనిల్, బ్యాంకు మిత్రలు వడ్డె మమత, సూర్య, సీఏలు స్వప్న, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో సైబర్ నేరాలకు చెక్



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై నరేష్

సంగెం : అప్రమత్తంగా ఉండడం ద్వారా సైబర్ నేరాలకు చెక్ పెట్టాలని ఎస్సై ఎల్.నరేష్ తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ 'సైబర్ నేరాలు, నూతన చట్టాలు' అంశంపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అపరిచితుల ఫోన్ కాల్‌కు స్పందించవద్దని, వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దని చెప్పారు. బ్యాంకు అధికారులు ఫోన్ ద్వారా ఏటీఎం పిన్, సీవీవీ నంబర్, ఏటీఎం కార్డు నంబర్ వంటివి అడగరని స్పష్టం చేశారు. ఫోన్‌లో బ్యాంకు అధికారులమంటూ ఎవరైనా అడిగితే అప్రమత్తతతో వ్యవహరించాలని చెప్పారు. విద్యార్థులు సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను అధ్యయనం చేసి అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని ఆకాంక్షించారు. మూఢనమ్మకాలు నమ్మవద్దని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. బాలికలు, మహిళలు గృహహింస వంటి ఆపదల్లో ఉంటే డయల్ 100కు ఫోన్ చేసి తక్షణ సాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు భవనం నిర్మించాలి

- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు వినతి



ఎమ్మెల్యేకు పూలబొకే అందిస్తున్న ప్రిన్సిపాల్

వర్ధన్నపేట : వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి చొరవ చూపాలని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును ప్రిన్సిపాల్ గుళ్ల వెంకటయ్య ఆధ్వర్యంలోని బృందం కోరింది. ఈ మేరకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది ఎమ్మెల్యేను హనుమకొండలోని అతడి నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ వెంకటయ్య మాట్లాడారు. గతంలో శిలాఫలకం వేసినప్పటికీ టెండరు ప్రక్రియ పూర్తి కాలేదని, నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. కళాశాల గేట్ సమీపంలో బస్సు షెల్టర్ మంజూరు చేయించాలని, కళాశాలకు మైక్ సెట్ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజ్‌కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పాపన్న జయంతి వేడుకలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

నర్సంపేట : ఈనెల 18 నుంచి 25 వరకు అన్ని మండల కేంద్రాల్లో సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ కోరారు. పట్టణంలో గోపగాని వెంకట్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన పొలిట్‌బ్యూరో సమావేశానికి రమేష్ అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలుపుకుని పాపన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని చెప్పారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు అమరవేణి నర్సాగౌడ్, రాగుల సిద్ధిరాములు, బాలేషం, బాలగాని సురేష్, కొండాపురం బాలరాజు, ముత్యం నర్సింహులు, కొండగోని రవి, స్వామి, రామారావు, గొడిశాల సదానందం, మద్దెల సాంబయ్య, మచ్చిక రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే హక్కుల సాధన

నర్సంపేట : ఐక్యఉద్యమాలతోనే హక్కులను సాధించుకోగలమని బీసీ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్ తెలిపారు. 'హలో బీసీ.. చలో హైదరాబాద్' కార్యక్రమానికి పట్టణం నుంచి ఆ సంఘం నాయకులు శనివారం బయల్దేరారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. సమగ్ర కుల జనగణన చేపట్టి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్య కులాల వేదిక జిల్లా బాధ్యుడు మచ్చిక రాజు, బీసీ కులాల ఐక్యవేదిక నియోజకవర్గ నాయకుడు అంకాల సాగర్, బీసీ పవర్ నాయకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

గీసుకొండ : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ కోస సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రను న్యూఢిల్లీలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం కలిశారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టులో తీర్పు వెలువడటానికి లూథ్ర వాదన ప్రధానంగా నిలిచారంటూ ఆయన్ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత కంటి పొర చికిత్స శిబిరం

వర్ధన్నపేట : పట్టణంలోని పాత మునిసిపాలిటీ కార్యాలయంలో నేడు (ఆదివారం) నుంచి 17వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత కంటి పొర ఉచిత చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శంక నేత్రాలయ కంటి వైద్యశాల, నాట్యజ్యోతి కూచిపూడి డ్యాన్స్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గిరిజన జనసమితి కమిటీల నియామకం

సంగెం : తెలంగాణ గిరిజన జన సమితి కమిటీలను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సపావట్ మహేంద్రనాయక్ శనివారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా భూక్య వెంకన్న, సంగెం మండల అధ్యక్షుడిగా గుగులోత్ సుమన్, ఉపాధ్యక్షుడిగా బానోత్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ రాజన్, సలహాదారుగా గుగులోత్ వెంకటేష్, సోషల్ మీడియా కన్వీనర్‌గా బానోత్ నవీన్‌లను నియమించినట్లు పేర్కొన్నారు.

అంగడి రోడ్డుకు మరమ్మతు చేయండి



ఫ్లెక్సీతో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

గీసుకొండ : మండలంలోని కొమ్మాల అంగడికి వెళ్లే రోడ్డు శిథిలమై బురదమయంగా మారిన క్రమంలో వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ నందనాయక్‌తండా పరిధిలోని ఇప్పలపల్లి వాసులు శనివారం రాస్తారోకో జరిపారు. బురదమయంగా మారిన రోడ్డు ఫొటోతో ముద్రించిన ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. అంగడికి పశువులతో వెళ్లే వాహనాలను అడ్డుకున్నారు. ఏటా కోటి రూపాయలకు పైగా ఆదాయం వస్తున్న అంగడి అభివృద్ధిని ప్రభుత్వం, అధికారులు విస్మరిస్తుండడం సరికాదన్నారు. రోడ్డుకు మరమ్మతు చేసే వరకు అంగడిని సాగనీయమని స్పష్టం చేశారు. రోడ్డు నిర్మిస్తామని పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్, విశ్వంత్, ఆరకట్ల ప్రవీణ్, బొట్ల రమేశ్, సాంబశివరావు, భరత్, వెంకటేశ్వర్లు, లక్ష్మినారాయణ, రాధ, సుభద్ర, సరోజన, భారతి, సువాలీ, ఇందిర, సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

నర్సంపేట : అర్హులైన కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర కృష్ణ కోరారు. పట్టణంలో ఐత శ్రీకళ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో కృష్ణ మాట్లాడారు. కళాకారులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. కళాకారులకు హెల్త్ కార్డులు ఇవ్వడంతోపాటు బస్సు, రైళ్ల ప్రయాణాల్లో రాయితీ కల్పించాలని, వృద్ధాప్యంలో ఉన్న వారికి రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని, అన్ని జిల్లాల్లో మినీ రవీంద్ర భారతి సాంస్కృతిక భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నాయకులు రమేష్, అక్కపల్లి రమేష్, మియాపురం గోవర్ధన్, బత్తుల సుప్రియ, అముదాల సుమలత, కవిత, పవన్ కుమార్, స్వప్న, హంస, మంజుల, బోళ్ల హరిత, రాధిక, స్వరూప, ఎల్లాపురం భవాని, రమ, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే పద్మశాలి కులస్తుల ఉన్నతి



ఐక్యత చాటుతున్న నాయకులు

సంగెం : ఐక్యంగా ఉండడం ద్వారానే పద్మశాలి కులస్తుల ఉన్నతి సాధ్యమవుతుందని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా పోటీ చేస్తున్న వల్లపాటి రాజ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం కమ్యూనిటీ హాల్‌లో మండల అధ్యక్షుడు నరహరి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడారు. మండలంలోని పద్మశాలి కుల సభ్యులందరూ తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే పద్మశాలి కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే దిశగా పాటుపడతానని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్నె శరత్‌బాబు, నాయకులు బిట్ల సత్యనారాయణ, ఇప్పకాయల మనోహర్, అనుమాండ్ల రమేష్, చిందం వీరస్వామి, బూర ప్రకాష్, కొంతం వేణు, కందకట్ల వెంకన్న, సంపత్, రామకృష్ణ, లక్ష్మణ్, లక్ష్మినర్సయ్య పాల్గొన్నారు.

'సఖి' సేవలతో మహిళలకు సాంత్వన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తిరుమల, తదితరులు

గీసుకొండ : సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు సఖి కేంద్రాల ద్వారా సాంత్వన లభిస్తుందని కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న తెలిపారు. మండలంలోని దస్రుతండా, మచ్చాపూర్‌ల్లో శనివారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, బాలికల రక్షణ కోసం అనేక చర్యలు చేపడుతున్నాయని చెప్పారు. సమస్యల్లో ఉన్న మహిళలు హెల్ప్ లైన్ నంబర్ 181కు ఫోన్ చేస్తే న్యాయ, వైద్యసేవలు అందించడంతోపాటు ఉచితంగా తాత్కాలిక వసతి కూడా లభిస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంత మహిళలు హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం సఖి కేంద్రాల ద్వారా లభిస్తున్న సేవలపై అవగాహన కల్పించేలా ముద్రించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వీఓఏలు నిర్మల, అమృత, అంగన్‌వాడీ టీచర్లు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి

సంగెం : గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రభుత్వం గౌరవించాలని తెలంగాణ గిరిజన జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేందర్‌నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గంగపుత్ర కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్‌కు అన్ని తండాల్లో నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయడంతోపాటు సేవాలాల్ జయంతి, తీజ్, సీత్లా భవాని పండుగ రోజులను సెలవు దినాలుగా ప్రకటించాలని, మండల కేంద్రాల్లో గిరిజనుల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని, రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడా నాయకులకు చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్, భూక్య వెంకన్న, కీసర వీరన్న, బానోత్ వెంకటేష్, ముకుందం, రమేష్, సుమన్, నవీన్, వినోద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

దుగ్గొండి : కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి వందలాది మంది మృత్యువాత పడగా వేలాది మంది నిరాశ్రయులైన క్రమంలో బాధితులకు సహాయం అందించడానికి అఖిల భారత్ కిసాన్ సభ ఆధ్వర్యంలో మండల నాయకులు గిర్నిబావిలో శనివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ మాట్లాడారు. ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని అన్ని రాజకీయ పార్టీలు డిమాండ్ చేసినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఆదుకునేందుకు ప్రజలు ముందుకొస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కోరబోయిన కుమారస్వామి, జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల క్రిష్టారెడ్డి, నాయకులు చల్ల నర్సింహారెడ్డి, కోడం రమేష్, సుధాకర్, పుచ్చకాయల నర్సింహారెడ్డి పాల్గొన్నారు

10 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

చెన్నారావుపేట : పేకాడుతున్న 10 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై గూడ అరుణ్ కుమార్ తెలిపారు. ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. మండలంలోని జల్లి గ్రామ శివారు చెరువు కట్ట సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద పలువురు పేకాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో శనివారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించినట్టు తెలిపారు. ఈ క్రమంలో పేకాట ఆడుతున్న జల్లి గ్రామానికి చెందిన జరుపుల ప్రవీణ్, నూనె నాగరాజు, మహమ్మద్ సుభాన్, గందె అభిలాష్, సంగెం నితిన్, మంచాల సురేశ్, మంద రాజేశ్, మహమ్మద్ అక్బర్, మంద రవి, పిట్టల కృష్ణచారిలను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి 420 రూపాయల నగదుతోపాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

బాధిత కుటుంబాలకు సరుకుల అందజేత

రాయపర్తి : మండలంలోని పెర్కవేడులో మామిండ్ల గౌరమ్మ, మెరుగు పద్మ, కాయతోజు అమృతమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ముద్రబోయిన వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం..

రాయపర్తి : మండలంలోని ఊకల్‌కు చెందిన కత్తి బుచ్చమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాల శ్రీనివాస్ శనివారం 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బూడిద రవి, నాయకులు ముడికె యాకన్న, బొమ్మగాని అశోక్, శ్రీపాద సాయి తదితరులు పాల్గొన్నారు.